## కుప్పం అభివృద్ధి పనులపై
## కడ ప్రాజెక్టు డైరెక్టర్ క్షేత్రస్థాయి పరిశీలన



**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, జూన్ 18:**
చిత్తూరు జిల్లా కుప్పం ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ కడ ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్, ఐఏఎస్ బుధవారం పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు చేపట్టిన ఈ పర్యటనలో వివిధ అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. మొదటగా చిన్నరిదొడ్డి, గోకర్లపల్లి గ్రామాలను సందర్శించిన వికాస్ మర్మట్, భూ సమస్యలకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. స్థానిక రైతులు, గ్రామస్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. భూ వివాదాలు, పెండింగ్ అంశాలను నిబంధనలకు అనుగుణంగా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం కుప్పం ఏరియా ఆసుపత్రిని సందర్శించి నూతనంగా నిర్మాణంలో ఉన్న సీటీ స్కానింగ్ కేంద్రం భవన పనులను పరిశీలించారు. ప్రజలకు ఆధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకు రావడంలో ఈ కేంద్రం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొంటూ, నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. ఆసుపత్రి ఆవరణలో చేపడుతున్న సుందరీకరణ పనులను కూడా పరిశీలించిన ఆయన, రోగులు మరియు వారి సహాయకు లకు పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పచ్చదనం పెంపు, పారిశుధ్యం, రోగులకు అనుకూలమైన సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. తదుపరి కృష్ణదాసనపల్లి గ్రామంలో ఏర్పాటు కానున్న శ్రేష్ఠ రిన్యూవబుల్స్ బయోగ్యాస్ పరిశ్రమ స్థలాన్ని సందర్శించి భూమి లెవెలింగ్ పనుల పురోగతిని సమీక్షించారు. హరిత ఇంధన ఉత్పత్తి, పర్యావరణ పరిరక్షణతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ఈ ప్రాజెక్టును వేగవంతంగా అమలు చేయాలని సంస్థ ప్రతినిధులు, అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా వికాస్ మర్మత్ మాట్లాడుతూ, కుప్పం ప్రాంత అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు అందించే అన్ని అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ పర్యటనలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కుప్పంలో హాకీ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు కసరత్తు
### ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించిన కడ పిడి వికాస్ మర్మత్, అంతర్జాతీయ హాకీ క్రీడాకారిణి రజిని



**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, జూన్ 18:**
చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో హాకీ క్రీడాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్న నేపథ్యంలో హాకీ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు కసరత్తు ప్రారంభమైంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ డైరెక్టర్, అంతర్జాతీయ హాకీ క్రీడాకారిణి, రెండుసార్లు ఒలింపియన్ రజిని కుప్పంలో పర్యటించి పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా హాకీ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, క్రీడా మైదానాలు, విద్యార్థుల ఆసక్తి, శిక్షణకు అవసరమైన వనరులను పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి విద్యార్థులకు ఉన్నత స్థాయి శిక్షణ అందించడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యమని తెలిపారు. అనంతరం కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మట్, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పి.ఎస్. మునిరత్నంను కలిసి క్రీడల అభివృద్ధిపై చర్చించారు. హాకీతో పాటు ఇతర క్రీడలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించే కార్యక్రమాల అమలు, శిక్షణ సదుపాయాల విస్తరణపై అభిప్రాయాలు పంచుకున్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి భాస్కర్, సీనియర్ కోచ్ ప్రసన్న కుమార్ రెడ్డి,స్పోర్ట్స్ కోఆర్డినేటర్ మహేష్,శారీరక విద్య ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. హాకీ శిక్షణ కేంద్రం ఏర్పాటు ద్వారా కుప్పం ప్రాంతం నుంచి మరింత మంది ప్రతిభావంతులైన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేఅవకాశంకలుగుతుందని అధికారులు, క్రీడావర్గాలు ఆశాభావంవ్యక్తం చేశాయి.

## టిబి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 18:**
చిత్తూరు జిల్లాకుప్పంలోని పీఈఎస్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో జాతీయ టిబి ముక్త భారత్ అభియాన్ 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా టిబి బాధితులకు పోషకాహార కిట్ల పంపిణీ చేపట్టారు. చిత్తూరు జిల్లా టిబి నియంత్రణ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పీఈఎస్ మెడికల్ కాలేజీ మెడిసిన్ విభాగాధిపతి కీలక ప్రసంగం చేశారు. టిబి వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రజల సహకారం అవస రమని, బాధితులకు పోషకాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్య పరిస్థితి మెరుగు పడుతుందని తెలిపారు. టిబి వ్యాధిపై అపోహలను వీడి, ప్రారంభ దశలోనే లక్షణాలను గుర్తించి వైద్యులను సంప్రదించాలని సూచించారు. నిరంతర చికిత్సతో వ్యాధిని పూర్తిగా నయం చేసుకోవచ్చని, సమాజంలోని ప్రతి ఒక్కరూ టిబి నిర్మూలనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మెడిసిన్ విభాగం వైద్యులు, టిబి విభాగ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



# సూర్యఘర్, విద్యుత్ సంస్కరణల పనులు వేగవంతం చేయాలి
### సెప్టెంబర్ 30 నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశాలు.. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, జూన్ 18:**
ప్రధానమంత్రి సూర్యఘర్, పీఎం కుసుమ్, పునరుద్ధరించ బడిన పంపిణీ రంగ పథకం (ఆర్డీఎస్ఎస్) అమలుపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి, పెండింగ్ పనులను సెప్టెంబర్ 30 నాటికి పూర్తి చేయాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద రావు అధికారులను ఆదేశించారు. చిత్తూరు కలెక్టరేట్‌లో నిర్వ హించిన విద్యుత్ సంస్కరణల సమీక్ష సమావేశంలో ఎంపీ, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యేలు గురజాల జగన్మో హన్, మురళీమోహన్, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లా డుతూ రూ.468.33 కోట్లతో చేపట్టిన ఆర్డీఎస్ఎస్ పనుల్లో ఇప్పటికే రూ.241.52 కోట్ల వ్యయంతో పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను వేగవంతం చేయాలని సూచించారు. సోలార్ ప్లాంట్ల నిర్మాణంలో జాప్యం లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, నిర్లక్ష్యం ప్రదర్శించే కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ నియోజకవర్గాల్లో చేపడుతున్న విద్యుత్ అభివృద్ధి పనుల వివరాలను సంబంధిత ఎమ్మెల్యేలకు తెలియజేయాలని కోరారు. రైతులకు అవసరమై న విద్యుత్ కనెక్షన్లు త్వరితగతిన అందుబాటులోకి తేవాలని సూచించారు.




చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ సూర్యఘర్ పథకంపై పట్టణ ప్రాంతాల్లో అవగాహన పెంచాలని, రైతు లకు ఉపయోగపడేలా పీఎం కుసుమ్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. విద్యుత్ సంస్కరణల అమలుపై ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్ష సమావేశాలు నిర్వహించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 18,456 రూఫ్‌టాప్ సోలార్ యూనిట్లు ఆమోదించగా, 1,408 యూనిట్లు పూర్తయ్యాయని తెలిపారు. అర్హులైన సాధారణ, ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు సబ్సిడీతో పాటు ఉచిత సోలార్ ప్యానెల్స్ అందిస్తున్నట్లు వెల్లడించారు. గ్రామాల్లో ప్రజలకు ఈ పథకాలపై విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

# బాలల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది
### రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మలతతో ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, రాజులు భేటీ

**కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 18:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు కె.జి. వెంకట పద్మలత కుప్పం పర్యటన సంద ర్భంగా స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షుడు పి.ఎస్. మునిరత్నం, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ అధ్యక్షుడు జి.ఎం. రాజులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో కుప్పం నియోజకవర్గంలోని విద్యా రంగం, బాలల సంక్షేమం, బాలల హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలికల విద్యాభివృద్ధి, విద్యార్థుల భద్రత, పోషకాహార కార్యక్రమాల అమలు వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బాలల హక్కుల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. పిల్లల విద్య, ఆరోగ్యం, భద్రత, మానసిక వికాసం



వంటి అంశాల్లో ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. బాలల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని సమావేశంలో ప్రస్తావించారు. కుప్పం నియోజకవర్గంలో అమలవుతున్న బాలల సంక్షేమ కార్యక్రమా లపై కమిషన్ సభ్యురాలు పద్మలత వివరాలు అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. పిల్లలకు మెరుగైన అవకాశాలు కల్పించి వారి భవిష్యత్తును బలోపేతం చేయడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరవేయాలని సూచించినట్లు తెలిసింది. బాలల హక్కుల పరిరక్షణ, విద్యాభివృద్ధి అంశాల్లో ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమని నాయకులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మంత్రి అనితపై వ్యాఖ్యలు ఖండించిన తెలుగు మహిళలు



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూన్ 18:**
రాష్ట్ర హోంశాఖ మంత్రి అనితపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ కుప్పం నియోజకవర్గ తెలుగు మహిళ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కుప్పంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు చంద్రకళ ఆధ్వర్యంలో పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బెస్తకుల కార్పొరేషన్ డైరెక్టర్ తిరుమగళ్, రెస్కో డైరెక్టర్ అనసూయతో పాటు పలువురు తెలుగు మహిళ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర హోంశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న అనితను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయడం మహిళా సమాజాన్ని అవమానపరచడమేనని మండిపడ్డారు. మహిళలు అలంకరణ చేసుకోవడం సహజమైన విషయమని, అలాంటి వ్యక్తిగత అంశాలను రాజకీయ విమర్శలకు వేదికగా మార్చడం సరికాదని పేర్కొన్నారు. మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం బాధ్యతాయుతమైన రాజకీయ నాయకుడికి తగదని విమర్శించారు. ప్రజా జీవితంలో కష్టపడి ఎదిగిన నాయకురాలిపై వ్యక్తిగత విమర్శలు చేయడం దురదృష్టకరమని అన్నారు. మహిళలను కించపరిచే విధంగా చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని రాష్ట్ర మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని గుడివాడ అమర్నాథ్‌ను డిమాండ్ చేశారు. మహిళల వ్యక్తిగత స్వేచ్ఛ, గౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. రాజకీయ విమర్శలు ప్రజా సమస్యలు, విధానాలపై ఉండాలని, మహిళల వ్యక్తిగత అంశాలను రాజకీయాల్లోకి లాగడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. మహిళల గౌరవాన్ని కాపాడేందుకు తెలుగు మహిళలు ఎల్లప్పుడూ ముందుంటారని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పలువురు తెలుగు మహిళ నాయకులు, కార్యకర్తలు పాల్గొని మహిళల పట్ల గౌరవప్రదమైన భాషను పాటించాలని రాజకీయ నాయకులకు విజ్ఞప్తి చేశారు.

### ఎన్టీఆర్ కాలనీలో ప్రభుత్వ పాఠశాలలోని
## విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంల పంపిణీ
### విద్యాభివృద్ధికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ కృషి అభినందనీయం







**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 18:**
చిత్తూరు జిల్లా కుప్పం పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో గల ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. 11వ క్లస్టర్ ఇంచార్జి కన్నన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బెస్త కుల కార్పొరేషన్ డైరెక్టర్ తిరుమగళ్, యూనిట్ ఇంచార్జి సుబ్రమణి, స్థానిక కౌన్సిలర్ అభ్యర్థి రవి తదితరులు పాల్గొని విద్యార్థులకు యూనిఫాంలను, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా యూనిఫాంలు, పుస్తకాలు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యా వ్యవస్థ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను వారు కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం, ఆధునిక సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడం, విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయడం వంటి అంశాల్లో ప్రభుత్వం సమర్థవంతంగా ముందుకు సాగుతోందన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలను పెంపొందించుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని నాయకులు సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, క్లస్టర్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏటీఎంలు, బ్యాంకుల భద్రతపై ప్రత్యేక నిఘా
### అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు, అధికారులకు జిల్లా ఎస్పీ తుషార్ డూడి సూచన

**చిత్తూరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, జూన్ 18:**
ఇటీవల అనంతపురం జిల్లాలో చోటుచేసుకున్న ఏటీఎం అపహరణ ఘటన నేపథ్యంలో చిత్తూరు జిల్లా వ్యాప్తంగా బ్యాంకులు, ఏటీఎంల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి కీలక ఆదేశాలు జారీ చేశారు. బ్యాంకు అధికారులు, ఏటీఎం నిర్వహణ సంస్థల ప్రతినిధులు, పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించి భద్రతా చర్యలను కట్టుదిట్టం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరస్తులు కొత్త పద్ధతులను అనుసరిస్తున్న నేపథ్యంలో బ్యాంకులు, ఏటీఎంల వద్ద భద్రతా ప్రమాణాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడడంతో పాటు అలారం వ్యవస్థలు, మోషన్ సెన్సార్లు, లాకింగ్ వ్యవస్థలు, సరిపడా లైటింగ్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో బ్యాంకులు, ఏటీఎంలు, ఆర్థిక సంస్థల పరిసర ప్రాంతాల్లో పోలీసు పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా జాతీయ రహదారులు, జనసంచారం తక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తులు,గుర్తింపు లేని వాహనాలు లేదా అసాధారణ కదలికలు గమనించిన వెంటనే డయల్-112కు, చిత్తూరు పోలీసు వాట్సాప్ నంబర్ 94409 00005కు లేదా సమీప పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ప్రజల అప్రమత్తత, పోలీసుల అప్రమత్తత కలిసి వస్తేనే నేరాలను సమర్థవంతంగా అరికట్టగలమని, సురక్షిత చిత్తూరు నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎస్పీ పిలుపునిచ్చారు.



చిత్తూరు ఎక్స్‌ప్రెస్
APTEL/2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక



## బాల్యవివాహాలు, పోక్సో చట్టంపై విద్యార్థినులకు అవగాహన

**శక్తి యాప్ వినియోగంపై ప్రత్యేక ప్రచారం నిర్వహించిన చిత్తూరు జిల్లా పోలీసులు**



**చిత్తూరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, జూన్ 18:**
మహిళలు, బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ బాల్యవివాహ నిరోధక చట్టం, పోక్సో చట్టం,అత్యవసర సహాయ నంబర్లు, శక్తి యాప్ వినియోగంపై చిత్తూరు జిల్లా శక్తి బృందం అవగాహన కార్యక్రమం నిర్వహించింది. చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ దూడి ఆదేశాల మేరకు, శక్తి టీం నోడల్ అధికారి ఎస్.ఆర్.రాజశేఖర్ రాజు పర్యవేక్షణలో, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ సుబ్బారెడ్డి కస్తూరిబ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. బాల్యవివాహం చట్టవిరుద్ధమని,18 సంవత్సరాలు పూర్తి కాకముందే బాలికల కు వివాహం చేయడం వారి విద్య, ఆరోగ్యం,భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. బాలికలు చదువులో రాణించి స్వయం సమర్థులు గా ఎదగాలని సూచించారు. పోక్సో చట్టం కింద 18 సంవత్సరాల లోపు పిల్లలపై లైంగిక వేధింపులు, దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటారని వివరించారు. ఇలాంటి ఘటనలు ఎదురైనప్పుడు భయపడ కుండా వెంటనే పోలీసులను ఆశ్రయిం చాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 112 ఎమర్జెన్సీ నంబర్, 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ సేవలను వినియోగించుకోవాలని విద్యార్థినులకు తెలియజేశారు. మహిళల భద్రత కోసం ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన శక్తి యాప్ వినియోగ విధానాన్ని వివరించి, విద్యార్థినుల మొబైల్ ఫోన్లలో యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. అత్యవసర సమయంలో శక్తి యాప్‌లోని ఎస్ఓఎస్ బటన్ నొక్కగానే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం చేరడంతో పాటు కుటుంబ సభ్యులకు కూడా అలర్ట్ వెళ్తుందని అధికారులు వివరించారు. మహిళలు, బాలికలు తమ భద్రత కోసం ఈ యాప్‌ను తప్పనిసరిగా వినియోగిం చాలని సూచించారు. మహిళల భద్రత, బాలల హక్కుల పరిరక్షణ, చట్టాలపై అవగాహన పెంపొందించడం ద్వారా సమాజంలో సురక్షిత వాతావరణాన్ని నెలకొల్పడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని పోలీసులు తెలిపారు.

## మంత్రి అనితపై వ్యాఖ్యలు ఖండించిన తెలుగు మహిళలు



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 18:**
రాష్ట్ర హోంశాఖ మంత్రి అనితపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ కుప్పం నియోజకవర్గ తెలుగు మహిళ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కుప్పంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు చంద్రకళ ఆధ్వర్యంలో పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బెస్తకుల కార్పొరేషన్ డైరెక్టర్ తిరుమగళ్, రెస్కో డైరెక్టర్ అనసూయతో పాటు పలువురు తెలుగు మహిళ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర హోంశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తు న్న అనితను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయడం మహిళా సమాజాన్ని అవమానపరచ డమేనని మండిపడ్డారు. మహిళలు అలంకరణ చేసుకోవడం సహజమైన విషయమని, అలాంటి వ్యక్తిగత అంశాలను రాజకీయ విమర్శలకు వేదికగా మార్చడం సరికాదని పేర్కొన్నారు. మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం బాధ్యతాయుతమైన రాజకీయ నాయకుడికి తగదని విమర్శించారు. ప్రజా జీవితంలో కష్టపడి ఎదిగిన నాయకురాలిపై వ్యక్తిగత విమర్శలు చేయడం దురదృష్టకరమని అన్నారు.మహిళలను కించపరిచే విధంగా చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని రాష్ట్ర మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని గుడివాడ అమర్నాథ్‌ను డిమాండ్ చేశారు. మహిళల వ్యక్తిగత స్వేచ్ఛ, గౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. రాజకీయ విమర్శలు ప్రజా సమస్యలు, విధానాలపై ఉండాలని, మహిళల వ్యక్తిగత అంశాలను రాజకీయాల్లోకి లాగడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. మహిళల గౌరవాన్ని కాపాడేందుకు తెలుగు మహిళలు ఎల్లప్పుడూ ముందుంటారని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పలువురు తెలుగు మహిళ నాయకులు, కార్యకర్తలు పాల్గొని మహిళల పట్ల గౌరవప్రదమైన భాషను పాటించాలని రాజకీయ నాయకులకు విజ్ఞప్తి చేశారు.

## శాంతి లేఅవుట్‌లో నూతన విద్యుత్ సౌకర్యాల ఏర్పాటు





**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, జూన్ 18:**
చిత్తూరు జిల్లా కుప్పం మున్సిపాలిటీ 11వ క్లస్టర్ పరిధిలోని చిన్నకురబపల్లి శాంతి లేఅవుట్ లో ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు నూతన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేశారు. ప్రాంతంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ పనులు చేపట్టినట్లు 11వ క్లస్టర్ ఇంచార్జి కన్నన్, రెస్కో డైరెక్టర్ శివ దేవర్ తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ సౌకర్యాల వల్ల స్థానిక ప్రజలకు నిరంత రాయంగా విద్యుత్ సరఫరా అందడంతో పాటు భవిష్యత్ అవసరాలకు కూడా ఉపయోగపడనుంది. ప్రజల సమస్యలను గుర్తించి దశలవారీగా మౌలిక సదుపాయాలను మెరుగుపరు స్తున్నామని నాయకులు తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని పేర్కొన్నారు. కుప్పం ప్రాంతంలో విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సౌక ర్యాలను కల్పించేందుకు చర్యలు కొనసాగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో రెస్కో సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

### సంచార జాతులకు డీఎన్‌టీఏ,

## ఎన్‌టీఏ సర్టిఫికెట్లు జారీ చేయాలి

**వంశరాజ్ కుల ధ్రువీకరణ పత్రాల జారీకి అధికారులను కోరిన సంచార అర్ధసంచార జాతుల నాయకులు**



**బైరెడ్డిపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్18:**
సంచార,అర్ధసంచార జాతుల అభివృద్ధికి డి-నోటిఫైడ్ ట్రైబ్ (DNT), నోమాడిక్ ట్రైబ్ (NT) సర్టిఫికెట్ల జారీ ఎంతో అవసరమని చిత్తూరు జిల్లా సంచార జాతుల యువజన అధ్యక్షుడు ఎస్.కృష్ణమూర్తి పేర్కొన్నారు. బైరెడ్డిపల్లి మండల సంచార అర్ధసంచార జాతుల అధ్యక్షుడు మహేష్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ, ఈ సర్టిఫికెట్లు జారీ చేయడం ద్వారా విముక్తి జాతులుగా గుర్తింపు లభించి విద్య, ఉద్యోగ, సామాజిక,రాజకీయ,ఆర్థిక రంగాల్లో పురోగతి సాధించేందుకు అవకాశం కలుగుతుందని వివరించారు. స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు గడిచినా,ఎన్నో ప్రభుత్వాలు మారినా సంచార, అర్ధసంచార జాతులకు సమాన న్యాయం జరగలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వర్గాలు ఇప్పటికీ అట్టడుగు స్థాయిలోనే మిగిలి పోయాయని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మీ సేవ కేంద్రాల ద్వారా డీఎన్‌టీ, ఎన్‌టీ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ,వంశరాజ్ కులాని కి చెందిన వారికి బీసీ-ఏ,సీరియల్ నంబర్-18కింద కుల ధ్రువీకరణ పత్రాలు అందించడం లేదని ఆరోపించారు. ఈ విషయమై మండల రెవెన్యూ అధికారిని (ఎంఆర్ఓ) కలిసి వినతిపత్రం సమర్పిం చినట్లు తెలిపారు. వంశరాజ్ కులానికి చెందిన వారికి బీసీ-ఏ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసి న్యాయం చేయాలని వారు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కోట్రేపల్లి ఉమామహేశ్వర్, బి. కొత్తూరుఅనికెర వెంకటరమణతో పాటు సంచార అర్ధసంచార జాతుల సభ్యులు పాల్గొన్నారు.ద

### ఇంటర్మీడియట్ ఇంప్రూవ్‌మెంట్ ఫలితాల్లో

## ఎంవీఆర్ సాయి శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ




**గంగవరం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్,జూన్ 18:**
పలమనేరు పట్టణంలోని సాయినగర్‌లో ఉన్న ఎంవీఆర్ సాయి శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ ఇంప్రూవ్‌మెంట్ పరీక్షల ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విశేష ఫలితాలు సాధించినట్లు ఎంవీఆర్ విద్యాసంస్థల అధినేత ఎంవీఆర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి రాష్ట్ర స్థాయిలో మంచి మార్కులు సాధించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థుల విజయంలో అధ్యాపకుల కృషి, తల్లిదండ్రుల సహకారం ఎంతో కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. జూనియర్ ఇంటర్మీడియట్ ఎంపీసీ విభాగంలో వి. దీపిక 470 మార్కులకు గాను 467 మార్కులు సాధించగా, పి. దీప 463, జె. శ్రీనిధి 462, బి. దీక్షిత 462, కె. మోక్షజ్ఞ 462 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో ఎన్. భావన 447 మార్కులు, పి. సాయి గణేశ్ 444 మార్కులు సాధించారు. ఎంఈసీ విభాగంలో కె. పల్లవి 492 మార్కులు, సి. జానవి 489 మార్కులు, వై. సుమన్య 488 మార్కులు సాధించారు. సీఈసీ విభాగంలో బి. మౌనిక 490 మార్కులు, ఎన్.పీ. ధనలక్ష్మి 489 మార్కులు, బి.వి. సుమ 486 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. సీనియర్ ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ విభాగంలో వి.సి. దేవిశ్రీ 1000మార్కులకు గాను 990మార్కులు సాధించగా, సి. తరుణ్ 988 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో ఎ. హారికా రెడ్డి 988 మార్కులు, ఎస్. ఇక్రా 985 మార్కులు, తౌఫిక్ 984 మార్కులు సాధించారు. సీఈసీ విభాగంలో మౌనిష 977 మార్కులు, ఎంఈసీ విభాగంలో కీర్తి 962 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఎంవీఆర్ రెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మి సుధ, అధ్యాపక బృందం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల విజయంపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

## రిటైర్డ్ ఉపాధ్యాయుడు బోడిరెడ్డి ఎర్రమరెడ్డికి నివాళులు



**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, జూన్18:**
వెదురుకుప్పం మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు బోడిరెడ్డి రంగారెడ్డి కుటుంబ సభ్యుడు, బోడిరెడ్డి ఎర్రమరెడ్డి బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు కన్నుమూశారు. ఆయన మృతి పట్ల గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం ఎర్రమరెడ్డి భౌతిక కాయానికి వెదురుకుప్పం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మోహన్ మురళి నివాళు లర్పించారు. ఆయనతో పాటు బ్రాహ్మణపల్లి తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బోడిరెడ్డి కోదండరెడ్డి, మొండివెంగనపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, గంటవారిపల్లి మాజీ సర్పంచ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజారెడ్డి తదితరులు నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎర్రమరెడ్డి గ్రామాభివృద్ధికి, సామాజిక కార్యక్రమాలకు అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆయన మరణం గ్రామానికి తీరని లోటని పేర్కొంటూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలని నాయకులు ఆకాంక్షించారు.

## పెళ్లకూరు ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన సీ వేణయ్యా



**తిరుపతి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 18 :**
తిరుపతిజిల్లా పెళ్లకూరుమండల నూతన అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)గా బాధ్యతలు స్వీకరించిన సి.వేణయ్యకు విఆర్ఓ అసోసియేషన్ తిరుపతి డివిజన్ ప్రెసిడెంట్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ జి.చెంగల్రాయుడు ప్రత్యేక శుభాకాంక్షలు మరియు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.., సి.వేణయ్య మంచి వ్యక్తిత్వానికి, నిబద్ధతకు మారుపేరుగా నిలుస్తారని కొనియాడారు. ఆయన నాయకత్వంలో పెళ్లకూరు మండలం అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తుందని, మండల అభివృద్ధికి ఒక సమర్థవంతమైన, ఆదర్శవం తమైన అధికారిగా ఆయన సేవలందిస్తారని చెంగల్రాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన అధికారి ఆధ్వర్యంలో మండల పరిధిలోని ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు మరింత వేగంగా చేరువవుతా యని ఆయన పేర్కొన్నారు.

## మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి:

**భూమన కరుణాకర్ రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి**



**గంగాధరనెల్లూరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, జూన్18:**
చిత్తూరు జిల్లాలోని మామిడి రైతులకు ప్రభుత్వం తక్షణమే గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం గంగాధరనెల్లూరు మండలం గొల్లపల్లిలోని జైన్ జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మామిడి రైతులకు న్యాయమైన ధరలు ప్రకటించాలని నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో సుమారు 60 వేల మంది రైతులు రెండున్నర లక్షల ఎకరాల్లో మామిడి సాగు చేస్తున్నప్పటికీ రైతులకు సరైన గిట్టుబాటు ధర లభించడంలేదని విమర్శించారు. జ్యూస్ ఫ్యాక్టరీ యాజమాన్యాలు పరస్పర అవగాహనతో ధరలను తగ్గిస్తూ రైతులను తీవ్రంగా నష్టపరుస్తున్నాయని ఆరోపించారు. కిలోకు మూడు రూపాయలకు మించి చెల్లించలేమని ఫ్యాక్టరీ యాజమాన్యాలు చేతులెత్తేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలవకుండా యాజమాన్యాలకు మద్దతు ఇస్తోందని విమర్శించారు. జిల్లాలో సుమారు ఏడు లక్షల టన్నుల మామిడి దిగుబడి వచ్చినప్పటికీ దాదాపు రెండు లక్షల టన్నుల పంట చెట్ల కిందే రాలిపోయిందని తెలిపారు. వారం రోజులుగా కిలోమీటర్ల మేర మామిడి ట్రాక్టర్లు ఫ్యాక్టరీల వద్ద బారులు తీరుతున్నాయని, ఆలస్యంతో పండ్లు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం నాణ్యత లేదనే కారణాలతో ఫ్యాక్టరీలు రైతుల పంటను తిరస్కరిస్తున్నాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి ఇటీవల చిత్తూరు జిల్లా పర్యటనలో రైతు సంక్షేమం గురించి మాట్లాడినప్పటికీ మామిడి రైతుల సమస్యలను గుర్తించలేదా అని ప్రశ్నించారు. రైతుల ఇబ్బందులను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి గిట్టుబాటు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ, గతంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో రైతులు ఆర్థికంగా బలపడ్డారని తెలిపారు. రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చిన ప్రభుత్వం వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి, పెనుమూరు మండల అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, ఎస్ఆర్‌పురం మండల అధ్యక్షుడు మణి, సురేందర్ రెడ్డి, ముష్టిపల్లి యువ నాయకుడు వెంకటేష్, ఢిల్లీ, పెనుమూరు యువ నాయకుడు నవీన్ కుమార్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, పేడకంటపల్లి యువ నాయకులు మహేష్, విశ్వనాథం, కాలప్ప వెంకటేష్ పాల్గొన్నారు.

### డ్రోన్ సాంకేతికతతో పేకాట స్థావరంపై

## పోలీసుల దాడినలుగురు అరెస్ట్



**శాంతిపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, జూన్18 :**
చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం కేనమాకులపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సిద్ధపూరు గ్రామ సమీపంలో డ్రోన్ సాంకేతికత సహాయంతో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి నలుగురిని అరెస్టు చేశారు. మునేశ్వరస్వామి ఆలయానికి చెందిన కర్పూరం తోటలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు రాళ్లబూదుగూరు పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆధునిక డ్రోన్ సాంకేతికతను వినియోగించి నిఘా నిర్వహించారు. డ్రోన్ ద్వారా సేకరించిన సమాచారంతో సబ్ ఇన్‌స్పెక్టర్ ఐ.నరేష్ ఆధ్వర్యంలో పోలీసు బృందం ఆకస్మికంగా దాడి నిర్వహించింది. ఈ సందర్భంగా బహిరంగ ప్రదేశంలో నగదు పందేలతో "లోపల - బయట (మంగతాయి)" పేరుతో జూదం ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు అయిన వారిని జి. శ్రీనివాసులు, ఆర్. గజేంద్ర, కె. గణేష్, జి. కోటేశ్వరుడుగా గుర్తించారు. వీరంతా శాంతిపురం మండలానికి చెందిన వారేనని పోలీసులు తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.6,500 నగదు, 52 పేక ముక్కలు, ఒక గోనె సంచిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై రాళ్లబూదుగూరు పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 72/2026 కింద ఆంధ్రప్రదేశ్ గేమింగ్ చట్టం సెక్షన్ 9(1) ప్రకారం కేసు నమోదు చేసి, నిందితులను అరెస్టు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా జూదం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ప్రజలు దూరంగా ఉండాలని, ఎక్కడైనా అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరిస్తామని సబ్ ఇన్‌స్పెక్టర్ ఐ. నరేష్ తెలిపారు.

## గుండిశెట్టిపల్లెలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

**శాంతిపురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, జూన్18:**



చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం 30 సొన్నేగానిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని గుండిశెట్టిపల్లె గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యపైగ్రామస్థుల ఫిర్యాదు మేరకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏపీఆర్ కుమార్ గురువారం క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వడ్డివాని కుంట చెరువులో ఉన్న ప్రభుత్వ బోరును పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న బోరు మరమ్మతులకు అనుకూల పరిస్థితిలో లేకపోవడంతో కొత్త బోరు మోటారు, స్టేటర్, పైపుల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు. శాశ్వత పరిష్కారం లభించే వరకు గ్రామంలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపడతామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, తాగునీటి సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, తక్షణ చర్యలు చేపట్టడం ద్వారా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడటం అధికారుల బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అభివృద్ధి అధికారి సుధాకర్ నాయక్, రెస్కో డైరెక్టర్ అనసూయమ్మ, మాజీ సర్పంచ్ మంజూనాథ్, మునెప్ప, శివానంద, బాలసుబ్రమణ్యం, గ్రామస్థులు పాల్గొన్నారు.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143